సేవలు దూరం!

- కూటమి ప్రభుత్వ తీరుతో వెలవెలబోతున్న సచివాలయాలు
- వివిధ శాఖలకు సిబ్బంది కేటాయింపు
- ఏఎన్ఎంలు సబ్‌సెంటర్లకు అప్పగింత
- ఉద్యోగుల్లో వెల్లువెత్తిన అసంతృప్తి
- సచివాలయాల ముందు బోర్డుల తొలగింపు


52వ వార్డు సంజీవ్ నగర్‌లో సచివాలయం ముందు బోర్డు తొలగించిన దృశ్యం

విశాఖ విద్య: ప్రతీ గడపకూ సేవలు అందించాలనే ఉన్నతాశయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలు నేడు వెల వెల బోతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సచివాలయాలను నిర్వీర్యం చేస్తోంది. ఫలితంగా ప్రజానీకానికి పౌర సేవలు దూరమయ్యే రోజులు దాపురిస్తున్నాయి. ప్రజల ముంగిట ఉన్న సేవాలయాలను ఉన్న ఫలంగా మూసివేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతో కూటమి ప్రభుత్వం ఒకింత వెనుకంజ వేస్తున్నా.. ఇక్కడ పని చేస్తున్న సిబ్బందిని వేర్వేరు శాఖలకు సర్దుబాటు చేసేందుకు మాత్రం జోరుగానే ప్రయత్నాలు చేస్తోంది. దీంతో త్వరలో సచివాలయాలకు తాళాలు పడే అవకాశాలు ఉన్నాయనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

అవమానాలకు గురవుతున్న సిబ్బంది

సచివాలయ సిబ్బందిపై కూటమి నేతల అక్కసు వెళ్లగక్కుతున్నారు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ చదువులతో ఉద్యోగాల్లోకి వచ్చిన వారిపై ప్రస్తుతం అధికారులు సైతం చిన్నచూపు చూస్తుండడంతో సచివాలయ సిబ్బంది తీవ్ర మదన పడుతున్నారు. మరో పక్క సచివాలయాల్లో ప్రస్తుతం కూటమి నేతలు పాగా వేశారు. ఎవరికి ఏ పని చేయాలన్నా, తమకు సమాచారం ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేస్తుండడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిబంధనల మేరకు తమ విధులు నిర్వహించుకోనివ్వకుండా అడ్డంకులు సృష్టించడం తగదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాల ముందు బోర్డులు మాయం

గోపాలపట్నం మండలంలో 60 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, కంచరపాలెం సచివాలయాలు నిత్యం ప్రజలతో రద్దీగా ఉండేవి. గతంలో నమోదైన గ్రీవెన్స్‌లు కూడా ఈ ఏరియాల్లోనే ఎక్కువగా వచ్చేవి. జీవీఎంసీ జోనల్ కార్యాలయం,గోపాలపట్నంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లలేని అనేక మంది తమకు దగ్గరలోనే ఉన్న సచివాలయాల్లోనే దరఖాస్తులు ఇవ్వటం, ఏవైనా ఇబ్బందులు ఎదురైనా వాటికి సంబంధించిన ఫిర్యాదులను అందించేవారు. అయితే ప్రస్తుతం సచివాలయాల ముందు ఉన్న బోర్డులను కూటమి నాయకులు ఒత్తిడి చేసి తీయించేస్తున్నారు. కొన్ని చోట్ల కూటమి నాయకులే తమ కార్యకర్తంతో బోర్డులను తొలగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ సేవాలయాలుగా గుర్తింపు ఉన్న భవనాలపై బోర్డులను తొలగించడమేంటని పలువురు చర్చించుకుంటున్నారు.


ప్రజలు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న సాకేతపురం సచివాలయం


కళ తప్పిన సచివాలయం

అయోమయంలో సిబ్బంది

సచివాలయాల సిబ్బందిని వేర్వేరు శాఖలకు సర్దుబాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఆరోగ్య కార్యదర్శులుగా పనిచేస్తున్న వారిని సబ్ సెంటర్లకు పంపించేలా ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటికే సబ్ సెంటర్లలో పనిచేస్తున్న వారి కంటే తక్కువ వేతనంతో అక్కడ తమను విధులు నిర్వహించాలని ఆదేశించడంపై సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీనిపై రాష్ట్ర వ్యాప్త నిరశనలకు సైతం సిద్ధమవుతున్నారు. రెవెన్యూ, వెల్ఫేర్, ఇంజనీరింగ్,విద్య, పశు సంవర్ధక శాఖ, జీవీఎంసీ వంటి శాఖలకు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులను పంపించి త్వరలోనే సచివాయాలకు తాళాలు వేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం సాగుతుంది. ఇలాంటి పరిణామాలతో వేరే చోటకు వెళ్లి అవమానాలకు గురికావాల్సి వస్తుందోనని సచివాలయ సిబ్బంది తీవ్ర మదన పడుతున్నారు.

కార్యాలయాలకు వెళ్లే బాధ తప్పింది



సచివాలయం మా కాలనీలోనే ఏర్పాటు చేయటం వల్ల అవసరమైన పనులు సకాలంలో అయ్యాయి. గతంలో అయితే జ్ఞానాపురంలో ఉన్న జీవీఎంసీ జోనల్ ఆఫీస్, లేదంటే గోపాలపట్నంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. సచివాలయం వల్ల అన్ని సేవలు మా దగ్గరలోనే అందాయి. వీటిని నిర్వీర్యం చేసే చర్యలు ఎంతమాత్రం సబబు కాదు.

– బి. హేమలత, దుర్గాపురం, 57వ వార్డు

సచివాలయాల వల్ల ఎంతో మేలు



సచివాలయాల వల్ల ఎంతో మేలు జరిగింది. ఏదైనా సంక్షేమ పథకం కావాలంటే రాజకీయ పార్టీల నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ సచివాలయాలను ఏర్పాటు చేయటం వల్ల ఇంటి దగ్గరలోనే అన్నిరకాల పనులు చేసుకునే అవకాశం కలిగింది. అర్హత ఉంటే పథకం అందేది. ఇవి లేకపోతే మళ్లీ దూరంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలి. పనులు పోవడమే కాకుండా ఆర్థిక భారం కూడా పడతాది.

– జ్యోత్స్న, 52వ వార్డు

కార్మికులను మోసం చేస్తున్న కాంట్రాక్టర్లు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరుగుతున్న విస్తరణ పనుల్లో చేస్తున్న చాలామంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలను చెల్లించడం లేదని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజుయాదవ్ ఆరోపించారు. కార్మికుల సమస్యలపై నక్కవానిపాలెం వద్ద తన కార్యాలయంలో కార్మికులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు తమ వద్ద పని లేదనే కారణం చూపి, చాలా మంది కార్మికులను నెల రోజుల క్రితం తొలగించారన్నారు. అయితే సదరు కాంట్రాక్టర్ ఆయా కార్మికులకు ఇప్పటికీ బకాయి వేతనాలు గానీ, ఫైనల్ సెటిల్‌మెంట్ గానీ చేయకపోవడందారుణమన్నారు. తమకు రావలసిన డబ్బుల కోసం కార్మికులు నెల రోజులుగా తిరుగుతున్నా, కాంట్రాక్టర్ స్పందించడం లేదని, దీని వెనుక రాజకీయ హస్తం ఉందని ఆరోపించారు. కొంతమంది యూనియన్ నాయకులు కాంట్రాక్టర్‌తో చేతులు కలిపి కార్మికుల జీవితాలలో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై లేబర్ ఆఫీసర్ వద్దకు వెళ్తామని, అప్పటికీ న్యాయం జరగకుంటే హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ధర్నా దిగుతామని హెచ్చరించారు. హెచ్‌పీసీఎల్ యాజమాన్యం కలగజేసుకుని కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహం తనిఖీ


వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న వెంకట శేషమ్మ

విశాఖ విద్య: గోపాలపట్నం మండలం యల్లపువానిపాలెంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని జిల్లా లీగల్ సెల్ అథారిటీ సీనియర్ డివిజన్ సెక్రటరీ ఎం. వెంకట శేషమ్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులతో ఆమె కొద్ది సేపు మాట్లాడారు.వారికి అందుకున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, రుచికరమైన ఆహారం అందించాలని వసతి గృహ నిర్వాహకులకు సూచించారు.

క్లుప్తంగా

మెప్మా ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వద్ద గల ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రికి సమీపంలోని మైదానంలో, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు సోమవారం ప్రారంభించారు. పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, పలువురికి ఉపాధి ఇచ్చే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఈవో దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు కోరారు. డీఈవో ప్రేమ్ కుమార్‌ను సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. జిల్లాలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవంతో విద్యారంగ అభివృద్ధికి పాటుపడతారనే నమ్మకం ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధిలో తమ యూనియన్ భాగస్వామ్యం అవుతుందన్నారు.

పోలీసుల రక్తదానం


రక్తదానం చేస్తున్న పోలీసులు

గాజువాక: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గాజువాక పోలీసులు సోమవారం రక్తదానం చేశారు. గాజువాక క్లబ్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీసీపీ–2 మేరీ ప్రశాంతి, సౌత్ ఏసీపీ త్రినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో సందర్భంగా రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించే విధంగా అందరూ నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషి ఎంతో ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో సీఐ పార్థసారథి, గాజువాక క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి నిత్యం నాణ్యతా పరీక్షలు

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: నగర ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం కాకుండా నిత్యం నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు, నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎస్ రవితో కలిసి బర్మాకాలనీలో గల బ్లాక్ 18 నీటి సరఫరా పంప్ హౌస్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బర్మాకాలనీ పంప్ హౌస్ నుంచి సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించారు. రోజూ ఎన్ని శాంపిల్స్ పరీక్షిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం సమీపంలోని ఓ ఇంటి వద్ద వ్యక్తిగత కుళాయిలో వస్తున్న నీటిని కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల వద్ద నీటి సరఫరా విభాగం, ఏజెన్సీలతో పరీక్షలు జరిపి రోజుకి 300 ఎంఎల్‌డీ తాగునీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. నగరంలోని ఏ ప్రాంతంలోనైనా తాగునీరు పరీక్షించేందుకు మొబైల్ టెస్ట్ వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదించామని తెలిపారు. కాలువల వద్ద కలిసే పైప్‌లైన్లు మార్పించామని, లీకేజీలు గుర్తించి అరికట్టామన్నారు. వ్యక్తిగత కుళాయి కనెక్షన్ కలిగిన నివాసితులు జీవీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అందరికీ సముచిత స్థానం

సింధియా: ప్రజలకు అందుబాటులో ఉండి పని చేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని జీవీఎంసీ 62వ వార్డు టీడీపీ అధ్యక్షులు మజ్జి మాలినాయుడు అన్నారు. ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రూ. 100 సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు.

విద్యార్థుల నౌకా సందర్శన


విద్యార్థులకు నౌక పనితీరును వివరిస్తున్న సిబ్బంది


విద్యార్థులతో నౌకాదళ సిబ్బంది

సింధియా: విశాఖ తూర్పు నావికాదళానికి చెందిన నౌకలను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, సికింద్రాబాద్‌లోని ఆంధ్రూస్ స్కూల్ విద్యార్థులు సోమవారం సందర్శించారు. నేవీ డే 2024 కార్యకలాపాల్లో భాగంగా విద్యార్థుల్లో సముద్రం, నౌకలకు సంబంధించిన విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓడ సిబ్బంది విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. భారత నావికాదళం విజయాలు, చేపట్టిన కార్యకలాపాల గురించి, భారతదేశ సముద్ర వారసత్వ సంపదను గురించి తెలియజేశారు. ఐఎన్ఎస్ విశ్వకర్మను సందర్శించిన విద్యార్థులకు అగ్నిమాపక శిక్షణ, నౌకలో సౌకర్యాలను వివరించారు.

ఆర్మీలో చేరి, దేశానికి సేవ చేయండి

- ఈఎన్‌సీ సీనియర్ విద్యాధికారి కమాండర్ సురుచి గౌర్
- ముగిసిన బాలికల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్


ప్రసంగిస్తున్న సీనియర్ విద్యాధికారి కమాండర్ సురుచి గౌర్

సింధియా: దేశాన్ని కాపాడడంలో ఆర్మీ పాత్ర కీలకమని తూర్పు నావికాదళ కమాండ్‌కు చెందిన సీనియర్ విద్యాధికారి కమాండర్ సురుచి గౌర్ అన్నారు. నిబద్ధతతో ఆర్మీలో చేరి, దేశానికి సేవ చేసే భాగ్యం దక్కించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మల్కాపురం నౌసేనాబాగ్ కేంద్రీయ విద్యాలయం–1లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తరపున మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి బాలికల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ ఆఫ్ గైడ్ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా సర్ బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థిగా ఉన్నప్పుడే జీవితంలో గొప్పగా ఎదగడానికి కష్టపడి పనిచేసి, కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగీ ఆధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వేడుకల్లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

గాజువాకలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి



న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా

గాజువాక: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గాజువాకలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీతో గాజువాక బార్ అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై స్పందించారు. బార్ అసోసియేషన్ వినతి మేరకు మల్కాపురం సివిల్ అధికార పరిధిని గాజువాక కోర్టు పరిధిలో చేర్చడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బార్ అసోసియేషన్‌కు శాశ్వత భవనం నిర్మించడానికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభాకరరావు, పుల్లయ్య నాయుడు, సీనియర్ న్యాయవాదులు వి.కోదండ రామయ్య, బి.మురళీ కృష్ణరాజు, జి.చిరంజీవి, వెన్నెల ఈశ్వరరావు, పి.రాంబాబు, లెనిన్ బాబు, వి.శ్రీనివాసరావు, భాను తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం


స్టీల్‌ప్లాంట్‌లో సమగ్రత ప్రతిజ్ఞలో పాల్గొన్న ఇన్‌చార్జి సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మార్గదర్శకాల ప్రకారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో నిర్వహించిన సమగ్రత ప్రతిజ్ఞలో స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె. సక్సేనా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్. కరుణ రాజు, డైరెక్టర్లు ఎస్.సి. పాండే, గణేష్, జి.వి.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఎ.కె. సక్సేనా మాట్లాడుతూ ఉద్యోగులు విజిలెన్స్‌ను విధిగా మాత్రమే కాకుండా న్యాయమైన, విశ్వసనీయమైన కార్యాలయాన్ని సృష్టించడం బాధ్యతగా భావించాలన్నారు. సంస్థలో నైతిక ప్రవర్తనను బలోపేతం చేయడమే కాకుండాజవాబుదారీతనాన్ని పెంపొందించడానికి విజిలెన్స్ దోహదపడుతుందని చెప్పారు. సీవీవో డాక్టర్ కరుణరాజు మాట్లాడుతూ 'నేను లంచం ఇవ్వను, నేను లంచం తీసుకోను' అని ప్రతీ ఉద్యోగి పాటించాలన్నారు.

అగనంపూడి: దేశ సమగ్రత, సమైక్యతను కాపాడడానికి భారతపౌరులమైన మనం సన్నద్ధం కావాలని దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాసరావు అన్నారు. వీఎస్ఈజెడ్ పరిపాలనా భవనంలో నిఘా వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులతో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి


వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు నలుగురు వినతులు అందించారు. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బి.రాము నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 వినతి అందినట్లు ఆయన తెలిపారు. ఆర్‌వో బాబూ రావు, ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.2.79 కోట్ల ఆస్తి పన్ను వసూలు


జెడ్సీకి చెక్కు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు సోమవారం రూ.2,79,28,000 ఆస్తి పన్ను వసూలు చేశారు. ఏపీఐఐసీ, ఐలా నుంచి రూ.2,68,39,111 పన్ను వసూలు చేయగా, గాజువాక జోన్‌లోని సాధారణ నివాసాల నుంచి రూ.10,65,000 ఆస్తి పన్ను వసూలు చేశారు. వీటికి సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు సుభాన్, రెడ్డి మోహన్, కోరాడ శివ జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రికి అందజేశారు.

యాజమాన్యం నుంచి పరిహారం ఇప్పించాలని వినతి


ఎమ్మెల్యే గణబాబుకు సమస్య చెబుతున్న బాధితులు

మల్కాపురం: సీడబ్ల్యూసీ గొడౌన్ వద్ద ఈ నెల 6వ తేదీన జరిగిన ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సత్యం కుటుంబానికి సాయం అందించేలా యాజమాన్యంతో మాట్లాడాలని బాధితుని బంధువులు ఎమ్మెల్యే పి.గణబాబును కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మృతుని భార్య మాట్లాడుతూ తన భర్త కె.సత్యం డాక్‌యార్డ్ వద్ద గల సీడబ్ల్యూసీ గొడౌన్‌లో 20ఏళ్లుగా కలాసీగా చేస్తున్నాడని, తాము 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ వద్ద గల శాంతిగిరికాలనీలో ఉంటున్నామని తెలిపారు. ఈ నెల 6వ తేదీన గొడౌన్ వద్ద జరిగిన ప్రమాదంలో తన భర్తకు తీవ్రగాయాలయ్యాయని, అప్పుడు యాజమాన్యం వైద్యఖర్చులు చెల్లిస్తామని భరోసా ఇచ్చిందని చెప్పారు. ఆ తర్వాత తన భర్త ఎలా ఉన్నాడో యాజమాన్యం పట్టించుకోలేదని, సత్యం చికిత్స పొందుతూ మరణించారని తెలియజేశారు. తన భర్త మృతి చెందడంతో తమ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని, యాజమాన్యం నుంచి తమకు సాయం అందించేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్, మృతుని కుటుంబ సభ్యులు ఉన్నారు.

భయపెడుతున్న విద్యుత్ తీగలు!

- నివాసాలకు అతి సమీపంలో వైర్లు
- విద్యుత్ తీగలు మార్చాలని ప్రజల వేడుకోలు


హిమాచల్‌నగర్ ప్రాంతంలో ఇంటి పై నుంచి విద్యుత్ హెచ్‌టీ లైన్


ములగాడ విలేజ్ మలుపు వద్ద ఓ ఇంటికి సమీపంలో విద్యుత్ తీగలు


శ్రీహరిపురంలో ఇంటి ముందు విద్యుత్ తీగలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు భయపెడుతున్నారు. చాలా చోట్ల విద్యుత్ లైన్లు ఇళ్ల పై నుంచి వెళ్లడంతో పాటు కొన్ని చోట్ల నివాసాలకు సమీపంలో ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో ములగాడ విలేజ్‌లో మలుపు వద్ద విద్యుత్ హెచ్‌టీ లైన్ పలు ఇళ్లకు చేరువగా ఉంది. దీంతో వారంతా దూరంగా మార్చాలని వినతులు అందజేశారు. అయినా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.

హిమాచల్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంటి పై నుంచి విద్యుత్ హెచ్‌టీ లైన్లు వెళ్లడంతో నివాసీయులు కలవర పడుతున్నారు. అధికారులకు విద్యుత్ తీగలను మార్పు చేయాలని పలు మార్లు వినతుల రూపంలో వివరించారు.అయినా నేటికీ స్పందన లేదు.

భయం.. భయం



శ్రీహరిపురంలో మా అక్క వాళ్ల ఇంటి ముందు నుంచి ఎల్‌టీ వైర్లు అమర్చారు.అయితే మహిళలు భవనం డూమ్ వద్ద దుస్తులు ఆరేసేటప్పుడు ఎక్కడ వస్త్రాలు ఆ తీగలకు తగిలి ప్రమాదం జరుగుతుందో అన్న భయం ఎప్పుడూ ఉంటుంది.అధికారులు స్పందించి విద్యుత్ వైర్లు మార్పు చేయాలి.

– బాబూరావు, శ్రీహరిపురం

అధికారులు స్పందించాలి



ములగాడ ప్రాంతంలో విద్యుత్ హెచ్‌టీ లైన్లు అధికారులు అమర్చారు.అయితే మా ప్రాంతంలో పలు ఇళ్ల ముందు నుంచి వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎక్కడ తెగిపడి ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నాం. సమస్యలపై అధికారులు స్పందించాలి.

– నర్సింగరావు, ములగాడ

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

గాజువాక: పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను పేరుతో జీతాల్లో కోత విధించిన మొత్తాన్ని తమ ఖాతాల్లో జమ చేయాలన్నారు. గాజువాక విలీన పంచాయతీ కార్మికుల పీఎఫ్ సొమ్ము చెల్లించాలని, డెత్, సిక్, రిటైరైన కార్మికుల వారసులకు ఉపాధి కల్పించాలని కోరారు. పారిశుధ్య కార్మికులతో అధికారులు, రాజకీయ నాయకులు తమ ఇళ్లవద్ద పని చేయించుకొంటున్నారని, వారిని తక్షణమే అక్కడి నుంచి ఉపసంహరించి విధులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరదల ముంపు సందర్భంగా స్పెషల్ డ్యూటీలు చేసిన కార్మికులకు నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. నాయకులు ఉరుకూటి రాజు, కె.కిరీటం పాల్గొన్నారు.